పదేండ్లల్ల ఎన్నడూ ఇట్ల సూడలే

మొదటిపేజీ తరువాయి...

గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను పార్టీ శ్రేణులతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. ఎర్ర శ్రీనివాస్ అనే రైతు ఎండిన తన వరిపైరును చూపిస్తూ ''సార్ పదేండ్లలో ఇటువంటి దరిద్రాన్ని నేను జూడలేదు. కేసీఆర్ సారు ఉండగా రెండు పంటలు వేసుకున్న. మస్తు నీళ్లొచ్చినయి. ఇప్పుడు ఇగో జూడు పొలం పర్రెలు పెట్టింది. ఏమి జేయాలో అర్థమైతలేదు. ఎవరిని అడిగినా మాకేమీ తెలువదు అంటుండ్రు. ఎప్పటిలెక్కనే ఈసారి గూడ నీళ్లు వత్తయి అనుకున్నం. ఇంత మోసం అయితదని అనుకోలే'' అంటూ మనసులో గూడుకట్టుకున్న ఆవేదనను కేటీఆర్ ముందు బయటపెట్టాడు. మరో రైతు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ''ఇప్పటికే నా రెండెకరాలు ఎండిపోయింది. ఇంకో రెండెకరాలూ ఎండిపోయేట్టున్నది. పెద్దపల్లికి తీసుకుపోతుండ్రు గానీ మాకు నీరిస్తలేరు. గింత అన్యాయమా? నాకు మనసున పడతలేదు. మందు తాగి లెటర్ పెట్టి సచ్చిపోతా సర్'' అంటూ తన బాధను చెప్పుకొన్నాడు.

బతికుండి కొట్టాడదాం

రైతుల మాటలకు స్పందించిన కేటీఆర్ వారిని వారించారు. న్యాయం జరిగే వరకు పోరాడతామని హామీ ఇచ్చారు. సమస్యకు చావు పరిష్కారం కాదని, ఎవరూ ఆ ఆలోచనే చేయవద్దని కోరారు. బతికుండి కొట్లాడదామని, ప్రభుత్వాన్ని నిలదీద్దామని పేర్కొన్న ఆయన చావు ఆలోచనను మనసులోకి రానివ్వొద్దని కోరారు.

అధికారులు మెసేజ్‌లు పెడుతుండ్రు

తోట వేణు అనే రైతు మాట్లాడుతూ వ్యవసాయ బావులకు రాత్రి 11 గంటల నుంచి త్రీఫేజ్ కరెంటు ఇస్తామని అధికారులు మెసేజ్‌లు పెడుతున్నారంటూ తన ఫోన్‌లోని మెసేజ్‌ను కేటీఆర్‌కు చూపించారు. అక్కడే ఉన్న మరికొందరు రైతులు మాట్లాడుతూ లోవోల్టేజీ కరెంటుతో మోటర్లు కాలిపోతున్నాయని, కరెంటు కోసం బావుల వద్ద మళ్లీ పడుకొనే రోజులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సాగునీరిచ్చి రైతులను ఆదుకోవాలి

పంటలు ఎండిపోకుండా తక్షణం సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ నుంచి సాగునీరు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరా రు. కరెంటు కోసం రైతులు మళ్లీ రాత్రివేళ బావుల వద్ద నిద్రపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరంపై కక్షతోనే ఎన్‌డీఎస్ కమిటీ అని కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొట్టకు వచ్చిన పంట ఎండుతున్నది

కొన్నేండ్ల నుంచి ఎస్సారెస్పీ కాలువ కింద వరివేస్తున్న. ఎన్నడూ ఇంత పంటనష్టం జరగలే. డీ-89 కాలువ కింద ఈసారి మూడెకరాల్లో వరేసిన. ఈ పదేండ్లు మంచిగ పంటలు పండించిన. ఇప్పుడు కరెంటు ఇబ్బందైతంది. కాలువ నీళ్లు సక్కగ అస్తలేవు. పొట్టకొచ్చిన పంట ఎండుతున్నది. ఏ అధికారి వచ్చి చూసిండి లేదు. వారబందీ ప్రకారం నీళ్లు సక్కగ వదిలితే ఈ కరువు వచ్చేది కాదు.

- ఎర్ర శ్రీనివాస్, రైతు, ఇరుకుల్ల, కరీంనగర్ మండలం



గురువారం కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామంలో రైతు మహ్మద్ బాషుతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరీంనగర్ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

మగాడివైతే మాట నిలబెట్టుకో

100 రోజుల్లో 420 హామీలు పూర్తి చెయ్యి

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్
- ఎంపీ ఎన్నికలయ్యాక బీజేపీలోకి జంప్ అయ్యే మొదటి వ్యక్తి రేవంతే
- ఇలాంటోడు సీఎం.. మన ఖర్మే
- మీరు ఐదేండ్లు ఉండాలని కోరుకుంటున్నా.. కానీ మీ పార్టీవాళ్లే మానవ బాంబులైతరు
- బండిది మొరుగుడే.. అభివృద్ధి లేదు
- ఎంపీగా వినోద్‌ను గెలిపించాలి:కేటీఆర్
- 12న బీఆర్ఎస్ కదనభేరిని అందరూ విజయవంతం చేయాలని పిలుపు

జైకొడుతున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గంలోని ముఖ్య కార్యకర్తలు

కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మార్చి 7 (నమస్తే తెలంగాణ): మగతనం అంటే ఎన్నికల్లో గెలవటం కాదని, మగాడివైతే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సవాల్ విసిరారు. 'రేవంత్.. నువ్వు మగాడివైతే ఇచ్చిన మాటను నిలబెట్టుకో. మగాడివైతే రూ.2 లక్షల రుణమాఫీ చేసి రైతులకు బాసటగా నిలువు. రైతు భరోసాను అమలు చేయాలి. ఎండుతున్న పంటలు, తడారిన గొంతులకు నీళ్లివ్వాలి. ఆడబిడ్డలకు మహాలక్ష్మి అమలు చేయాలి. దమ్ముంటే కోడలికి రూ.2,500, అవ్వలకు రూ.4000 ఇచ్చి చూపాలి. 100 రోజుల్లో మీ పార్టీ చెప్పిన 420 హామీలు అమలు చేసి చూపించు' అని అన్నారు. గురువారం కరీంనగర్‌లో పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో, సిరిసిల్లలో జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 12న కరీంనగర్‌లో నిర్వహించే కదనభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'రేవంత్‌రెడ్డి నీకు దమ్ముంటే సత్తా ఉంటే మగాడివైతే మల్కాజ్‌గిరికి రా.. నువ్వు నీ సీఎం పదవికి రాజీనామా చేసి రా.. నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా.. అక్కడనే తేల్చుకుందామని గతంలోనే చెప్పా. మళ్లీ అదే మాట చెప్తున్నా. రమ్మంటే చప్పుడు లేదు' అని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికలు అయిపోగానే బీజేపీలో చేరే మొదటి వ్యక్తి రేవంత్‌రెడ్డేనని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్నది అసలు కాంగ్రెస్ కాదని, రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగానే మరో ఏక్‌నాథ్‌షిండే, హిమంతబిశ్వశర్మ ఇక్కడి నుంచే వస్తారని అన్నారు. మహబూబ్‌నగర్‌లో రేవంత్ ఆవేశపూరిత మాటలను ప్రజలు గమనించాలని సూచించారు. జేబుల్లో కత్తెర పెట్టుకొని తిరిగేది జేబు దొంగ లేనని, ఏ రాజకీయ నాయకుడైనా కత్తెరలు పెట్టుకొని తిరుగుతారా? అని ప్రశ్నించారు. ఇలాంటివాడు సీఎం కావటం మన ఖర్మ అని అన్నారు. 'రేవంత్‌రెడ్డీ.. మానవ బాంబులు ఎవరో కావాల్సిన అవసరం లేదు. నీ పక్కన ఉన్న నల్లగొండ, ఖమ్మం కాంగ్రెస్ నాయకులే నీకు బాంబులవుతారు. మీ ప్రభుత్వాన్ని ఏమిచేయాలో వారే చేస్తారు. మీ ప్రభుత్వం ఐదేండ్లు నిక్షేపంగా ఉండాలని మేం మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. మీ 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు.

రైతుబంధు ఇచ్చే తెలివి ఉన్నదా?

రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి 90 రోజులు పూర్తయిందని, ఎన్నికల హామీలను గుర్తు చేసుకోవాల్సిన అవసరమున్నదని కేటీఆర్ అన్నారు. రైతులు కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయి ఓట్లు వేశారని, ఇప్పుడు ఆ బాధ వారిలో స్పష్టంగా తెలుస్తున్నదని తెలిపారు. రైతుబంధు రావటం లేదని రైతులు ఒకరి ముఖం ఒకరు చూసుకుంటున్నారని వెల్లడించారు. ఇప్పటి వరకు కనీసం రైతుబంధు ఇచ్చే మొఖం, తెలివి సీఎంకు లేవని మండిపడ్డారు. ప్రస్తుత కరవు కాలంతో వచ్చింది కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరవు అని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన కాళేశ్వరం ప్రాజెక్టును ఇప్పుడు బద్నాం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పిచ్చోళ్లు బండి సంజయ్‌కి, రేవంత్‌రెడ్డికి ఏమీ తెలియదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీఆర్ఎస్ మీద కోపముంటే, బద్నాం చేయాలంటే ఇదా పద్ధతి? రైతుల పొలాలు ఎండాలే, ప్రజల గొంతు ఎండాలే, బతుకులు ఆగం కావాలే, అప్పుడు కేసీఆర్‌ను తిట్టాలే.. అన్న చిల్లర రాజకీయాలే. ఇదేనా సీఎంకు ఉండాల్సిన పద్ధతి?' అని ప్రశ్నించారు.

అబద్ధాల రేవంత్‌రెడ్డిపై కదనభేరి

నాటి ఆంధ్రా పాలన మీద సింహగర్జన.. మళ్లీ ఈరోజు అబద్ధాల రేవంత్‌రెడ్డి మీద 12న కదనభేరి బహిరంగసభను అదే వేదికగా నిర్వహించుకుంటున్నామని కేటీఆర్ తెలిపారు. సభకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరు కావాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి చొక్కారావు, కేసీఆర్, బద్దం ఎల్లారెడ్డి లాంటి మహానుభావులు గెలిచారని, కరీంనగర్ నుంచి ఇప్పుడున్న బండి సంజయ్ ఎలా గెలిచాడో అర్థం కాదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌పై మొరగటం తప్ప ఒక్క మంచి పని చేశావా? మరి ఎందుకు నీకు ఓటు వేయాలి?' అని బండి సంజయ్‌ను ప్రశ్నించారు. తెలంగాణ కోసం గర్జించే గొంతు, పార్లమెంట్‌లో మన కోసం నినదించే గొంతు వినోద్‌కుమార్ గెలవాలంటే మనందరం గట్టిగా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నేతన్నల కోసం 'మహాధర్నా'

'ఇంతకాలం దేశాన్ని పందికొక్కుల్లా దొబ్బితిన్నది, దోచుకున్నది ఈ దగుల్బాజీ కాంగ్రెస్ నాయకులే. వంద రోజులు కాలేదు.. కండ్లు నెత్తికెక్కి కండకావరంతో బలుపు మాటలు మాట్లాడుతున్నరు' అని నేతన్నలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేకే మహేందర్‌రెడ్డిపై ఆయన నిప్పులు చెరిగారు. వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వకుంటే మళ్లీ ఉరిసిల్లగా మారే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. ఈ వారంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు, బకాయిలు రూ.200 కోట్లు విడుదల చేయకుంటే నేతన్నలతో కలిసి మహాధర్నా చేపడుతామని అన్నారు.

సమస్యలపై బండి మాట్లాడరేం?: వినోద్

బండి సంజయ్ ఎంపీగా ఈ ఐదేండ్లలో పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై, కరీంనగర్ పార్లమెంట్ సమస్యలపై ఏ రోజైనా మాట్లాడారా అని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎంపీ వినోద్ కుమార్ నిలదీశారు. అబద్ధాలు, పిచ్చి కూతలు, ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం తప్ప అభివృద్ధి గురించి ఎప్పుడైనా ఆలోచన చేశారా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ అధ్యక్షులు, పార్టీ జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలు

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను కేటీఆర్ ప్రకటించారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి, హుజూరాబాద్‌కు సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, హుస్నాబాద్‌కు ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వేములవాడకు మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, సిరిసిల్లకు తుల ఉమ, మానకొండూర్‌కు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, చొప్పదండికి పెండ్యాల భూపతిరెడ్డిని ఇన్‌చార్జీలుగా ప్రకటించారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు వీళ్లే ఇన్‌చార్జీలుగా కొనసాగనున్నారు.

వరి పొట్టకొచ్చింది.. మా పొట్ట కొట్టకుండ్రి

సాగునీరు ఇవ్వాలని రైతుల ఆందోళనలు

అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు • ప్రాజెక్టుల కింద ఎండుతున్న పంటపొలాలు

నీళ్లడిగితే కేసులు పెడతామని బెదిరింపులు • పంటలను కాపాడుకునేందుకు భగీరథయత్నాలు

'తలాపునే పారుతోంది గోదారి.. మన చేను, మన చెలక ఎడారి'

అన్నట్లుగా తయారయింది ఆయకట్టు రైతుల పరిస్థితి. పదేండ్లుగా పసిడి పంటలు పండించిన రైతులు మళ్లీ బీళ్లవుతున్న భూములను చూసి గుండెలు బాదుకుంటున్నారు. ప్రాజెక్టు కిందనే పొలాలు ఉన్నా సాగునీరు అందని దుస్థితిని చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ప్రాజెక్టుల్లో నీళ్లు వదలకపోవడంతో పొట్టకొచ్చిన వరి పంటను కాపాడుకోవడానికి నానాకష్టాలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పదే పదే వినతులు సమర్పించినా పట్టించుకోకపోవడంతో, కడుపుమండి రోడ్డెక్కుతున్నారు. నీళ్లడిగితే కేసులు పెడతామని అధికారులు బెదిరించినా.. అదరకుండా పంటలను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. చివరి ఆయకట్టు వరకూ నీళ్లివ్వాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

- నమస్తే తెలంగాణ, న్యూస్ నెట్‌వర్క్

దండంబెట్టి అడుగుతున్న..

నాకున్న నాలుగున్నర ఎకరాల్లో వరి పంట వేసిన. రెండెకరాలు ఎండి పోయింది. నీళ్లు ఇవ్వక పోతే మిగిలింది కూడా పోతది. వేలకు వేలు ఖర్చు పెట్టి కాపాడుకుంటే పొట్టకచ్చినంక ఒక్క ఇత్తు కూడా ఇంటికి రాదు. దండంపెడుతున్నం సార్.. నీరందిస్తే బతుకుతం.

- రాజయ్య, ముంజంపల్లి, జగిత్యాల జిల్లా

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని ముంజంపల్లి శివారులో పొట్ట దశలో ఎండిన పొలం వద్ద దిగాలుగా కూర్చున్న రైతు ఎర్రం రాజయ్య

పుట్లు పండిన పొలం జీవాలపాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన దండర వేని రజినీకాంత్‌కు అన్నపూర్ణ ప్రాజెక్టు సమీపంలో మూడెకరాలు ఉన్నది. అందులో ఎనిమిదేండ్లుగా వరి సాగు చేస్తున్నాడు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగునీటికి కొదవలేకపోవడంతో పుట్లకొద్దీ వడ్లు పండేవి. ఈ సీజన్‌లో ప్రాజెక్టు నుంచి నీటిని వదలకపోవడంతో మూడెకరాల వరిపంట ఎండిపోయింది. దీంతో గొర్రెల కాపరులకు చెప్పడంతో వారు పొలంలో ఇలా గొర్రెలను మేపుతున్నారు.

- ఇల్లంతకుంట, మార్చి 7

నీళ్లడిగితే కేసులంటున్నరు..

కుమ్మరికుంట వద్ద డీ-83 మెయిన్ కాలువకు మాకు వచ్చే తూము 11ఎల్ ఉంటుంది. మా పొలాలు ఎండిపోతున్నయని తూము తీసి నీళ్లివ్వాలని అడిగితే, కింది రైతులకు నీరందించాలి.. మీరు తూం తీస్తే విధుల్లో ఉన్న మాపై దాడి చేసినట్లు పోలీస్ కేసులు పెడతామని బెదిరిస్తున్నరు.

-కనుకయ్య, మారేడుపల్లి, జగిత్యాల జిల్లా

పెద్దపల్లి-కాటారం ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

పెద్దపల్లి-కాటారం ప్రధాన రహదారిపై ధర్నా

మంథని, మార్చి 7: సాగునీటి కోసం రైతులు గురువారం పెద్దపల్లి-కాటారం ప్రధాన రహదారిపై బైఠాయించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లి, కాకర్లపల్లి, మైదుపల్లి, ముత్తారం మండలం రామకృష్ణాపూర్, గంగాపురి తదితర గ్రామాలకు చెందిన రైతులు మంథనికి చేరుకొని సుమారు గంటన్నర పాటు ఎర్రటి ఎండలో నిరసన తెలిపారు. వేలల్లో పెట్టుబడి పెట్టామని..పంట చేతికొచ్చే దశలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రజాప్రతినిధులైనా స్పందించి కాలువల ద్వారా నీరందించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు రైతులపై దురుసుగా ప్రవర్తించడంతో ఉద్రిక్తత నెలకొన్నది. దీంతో మంథని ఆర్డీవో హనుమానాయక్ చేరుకొని ఈ నెల 9వ తేదీలోగా సాగునీరందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



21వ ప్యాకేజీ ద్వారా కప్పలవాగులోకి నీళ్లు వదలాలని భీమ్‌గల్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, రైతులు

భీమ్‌గల్‌లో బీఆర్ఎస్ నేతలు, రైతులు..

భీమ్‌గల్, మార్చి 7: పొట్టకొచ్చిన వరి పైర్లు ఎండిపోతుంటే ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. తక్షణమే సర్కారు స్పందించి 21వ ప్యాకేజీ ద్వారా కప్పలవాగులోకి నీటిని వదలాలని నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో రైతులు, బీఆర్ఎస్ నేతలు గురువారం ధర్నా నిర్వహించారు. నీళ్లు వదలాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి లేఖ రాశారని, ప్రభుత్వం నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలని కోరారు.

నీళ్లు ఇవ్వలేక వానపై నిందలా?

- స్కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): నీటి సమస్యను పరిష్కరించే చేవలేక, చేతగాక ఆ నెపాన్ని వర్షపాతంపైకి నెట్టేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విరుచుకుపడ్డారు. నిరుడు లోటు వర్షపాతం నమోదుకావడంతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు పడిపోతున్నాయని, ప్రజలు అర్థం చేసుకోవాలన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. భారత వాతావరణశాఖ లెక్కల ప్రకారం 2023-24లో సాధారణం కన్నా 14శాతం అధిక వర్షపాతం నమోదైందని గుర్తు చేశారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు అసత్యాలు మాట్లాడుతున్నదని, కాంగ్రెస్ తీరుతో ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. రైతు సమస్యలు తీర్చడం మాట అటుంచితే, తెలంగాణ రైతాంగానికి మూడు నెలల్లోనే స్కాంగ్రెస్ చేతగానితనం పూర్తిగా అర్థమైందని పేర్కొన్నారు.

నైరుతిలో 17 వాతం అధిక వానలు

రాష్ట్రంలో నిరుడు లోటు వర్షపాతం నమోదైందన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలు పచ్చి అబద్ధమని గణాంకాలు చెప్తున్నాయి. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీసీ)ప్రకారం.. నిరుడు నైరుతి రుతుపవనాల కారణంగా 17శాతం అధికంగా వానలు పడ్డాయి. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 73.8 సెంటీమీటర్లుకాగా నిరుడు జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య 86.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొత్తం 33 జిల్లాలకుగానూ 17 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా, 18 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైనట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలవారీగా చూస్తే సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో సాధారణం కన్నా 45శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లాలో మాత్రం 16 శాతం లోటు నమోదైంది. మొత్తంగా ఐదు జిల్లాల్లో మాత్రమే సగటున 11 శాతం మేర లోటు వర్షపాతం కనిపించింది

ఇప్పటికీ అధికమే

నిరుడు జూన్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 7వ తేదీ వరకు లెక్కించినా రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కన్నా ఎక్కువే నమోదైందని గణాంకాలు చెప్తున్నాయి. ఈ కాలంలో సాధారణ వర్షపాతం 86.6 సెంటీమీటర్లు కాగా, 91.4 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కంటే 6 శాతం అధికం. మొత్తంగా జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ మినహా రాష్ట్రంలోని మిగతా 31 జిల్లాల్లో సాధారణం లేదా, అంతకన్నా ఎక్కువ వర్షాలు పడినట్టు నివేదిక స్పష్టం చేస్తున్నది. ఇందులో 6 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. దీనిని బట్టి సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నవన్నీ అబద్ధాలేనని, నీటి సమస్యను పరిష్కరించలేక వానలపై నిందలు వేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు.

వాగులో జేసీబీ గుంతలు

• గంటకు రూ.3 వేలు ఖర్చు

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో పారే ఆకేరు వాగు ఎండిపోయింది. యాసంగి వరి పంట ఎండిపోతుంటే కౌసల్యదేవిపల్లి శివారులో వాగులో గంటకు రూ. 3వేలు ఖర్చు చేసి జేసీబీ సహాయంతో రైతులు ఇలా గుంతలు తవ్విస్తున్నారు. తొమ్మిదేండ్లలో ఇలాంటి ఇబ్బంది చూడలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆకేరు వాగులోకి ఎస్సారెస్పీ జలాలు వదిలి పంటలకు నీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

- నర్సింహులపేట, మార్చి 7